# యావజ్జీవ శిక్ష

**భా**స్కరంగారు నాకు బాగా దొరికాడు!

ఆయన ఎవరో నే నెరగను. ఆయన మాకు చుట్టంకాదు. ఆయనను మొదటిసారి చూసినప్పుడే నాకు కడుపులో తిప్పినట్టయింది. ఇన్ని వందలసార్లు చూసినా ఇప్పటికీ ఆయన కనిపిస్తే నాకు పైత్య వికారం వస్తూనే ఉంటుంది.

కండిషన్డ్ రిఫ్లెక్స్ అయి ఉంటుంది. ఆయన గొంతు విన్నా కూడా నాకు, పుల్లగా ఏదన్నా నోట్లో వేసుకోబుద్ధవుతుంది.

ఈ భాస్కరం అనే ఆయన నా పాలిటికొక దుష్టగ్రహమై, అసలే ధ్వంసంగానున్న నా జీవితాన్ని మరింత ధ్వంసధూళి చెయ్యటానికి కారకురాలు మా మేనత్త ఆదిశేషమ్మగారు.

నేను సింద్‌బాద్ నావికుడల్లే నడి సముద్రంలో ఉండగా ఒక కొయ్య పలకలాగా నన్ను మా ఆదెమ్మత్త కాపాడిన మాట కాదనను. ఆవిడ పాతిక రూపాయలు పంపి నన్ను పిలిపించి వుండకపోతే నేను నమ్మకంగా తిండికి మాడి చచ్చి వుండేవాణ్ణి.

కొందరు డబ్బు లేకుండా కొంతకాలమైనా బతగ్గల్రు. నాకా విద్యరాదు. నేను ఎరిగున్న వాణ్ణి డబ్బు లడగలేను. తీర్చలేని పరిస్థితుల్లో 'అప్పు' అని అడగటం ముష్టికాకపోదు సరే గదా, పచ్చి అబద్ధం కూడా అవుతుంది. కట్టు బట్టలతో దేశాలు బట్టిపోతూ, బాకీ తీరుస్తానని మాటయిచ్చి నక్షత్రకుణ్ణి వెంటబెట్టుకు పోయే సాహసం హరిశ్చంద్రుడికే చెల్లింది. నా కా 'గట్స్' లేవు. ప్రాణం నిలుపుకునేటందుకు బ్రహ్మహత్య అయినా చేయవచ్చునన్నారు మన పురాణాల్లో. నేను తిండికి మాడి చచ్చి అయినా పోగలనుగాని ముష్టి ఎత్తలేను.

ఒక్క ముక్కలో చెప్పాలంటే, నేను అప్రయోజకుణ్ని. నా అప్రయోజకత్వమే నన్ను ఈ భాస్కరంగారి వాతవేసింది. నేను పడతున్న మానసిక వ్యథ ఇంతా అంతా కాదు.

ఒక సముద్రంలోంచి నన్ను కాపాడిన మా ఆదెమ్మత్తయ్య నన్ను మరింత భయంకరమైన సముద్రంలో తోసింది.

అవును. ఉన్నమాట అనటానికి కృతజ్ఞత అడ్డు రానవసరం లేదు. ఈ భాస్కరాన్ని నా మెడకు చుట్టినది ఆవిడే.

మా అత్తయ్య వయసు మీరినది. ఆవిడమీద అభాండాలు వెయ్యాలని నా ఉద్దేశం కాదు. కాని ఆవిడకు ఆ భాస్కరం అంటే అంత గురి ఎందుకనో నాకర్థంకాలేదు. ఆయన

వట్టి దుర్ముహూర్తం లాంటివాడు; క్షామదేవత; ఓ భయంకరమైన ప్లేగు! ఆయన ఏ జన్మలోనో మా ఆదెమ్మత్తయ్యకి మొగుడై వుంటాడు. ఆయన పేరు సాధ్యమైనంత వరకూ ఉచ్చరించదు. తప్పనిసరిగా చెప్పవలసి వస్తే, రహస్యంగా, ఎవరో బలవంతాన తోసినట్టు చెబుతుంది మా అత్త.

ఆ భాస్కరం కూడా ఆవిడకు ఏది చెప్పినా వేద వాక్యంగా చెబుతాడు తప్ప ఆవిడ అభిప్రాయం అడగడు. తాను ఇచ్చే ప్రతి సలహా కూడా ఆవిడకు ఆజ్ఞలాంటిదేనని ఆయనకు తెలుసు.

మా అత్తయ్య నన్ను పిలిపించటం కూడా భాస్కరం గారి అనుమతితోనే అయివుంటుందని నా అనుమానం.

తానూ, తన నలుగురు కొడుకులూ, కూతురూ, భాస్కరం గారి అండ ఉండబట్టే బతుకుతున్నట్టు మా అత్తయ్య నమ్మకమని నాకు త్వరలోనే తెలిసిపోయింది. ఆయన ఇంచుమించు రోజూ పొద్దున్నా, సాయంకాలమూ తొంగిచూసి పోతూనే ఉంటాడు.

మా అత్తయ్య కూతురు రాధకు పెళ్ళి యీడు వచ్చింది.

" భాస్కరం గారుండగా నాకు పిల్ల పెళ్ళి బెంగ దేనికీ? ఆయనే అంతా చూస్తాడు" అని మా అత్తయ్య అనడం నేను విన్నాను.

భాస్కరం గారు అసమర్థుడని నేను చెప్పను. ఆయన అసమర్థుడైతే నాకీ బాధే లేకపోను. నే నెంత అసమర్థుణ్నో ఆయన అంత సమర్థుడు... నాకు ఉద్యోగం ఇప్పించింది ఆయనే. అది ఉద్యోగం కాదు. నా మెడకు ఉరితాడు.

యు – 235 పరమాణువులోకి స్లో న్యూట్రాను ప్రవేశించినట్టు భాస్కరం నా జీవితంలోకి సన్నగా ప్రవేశించాడు. దాంతో 'శృంఖలా ప్రతిక్రియ' అనే భయంకరమైన పేరూ, స్వభావమూ గల చెయిన్ రియాక్షన్ నా జీవితంలో ఆరంభమయింది.

అది ఆయన నన్ను రెండోసారి చూడటం. వరండాలో పేముకుర్చీ వేసుకుని కూర్చుని, కాళ్ళు వరండా స్తంభానికి తన్నిపట్టి, బాత్‌రూం ఖాళీకాగానే స్నానం చేద్దామనుకుని, ఈ లోపల పత్రికలో అసత్య వార్తలన్నీ చదువుతున్నాను (నాకవే సరదాగా ఉంటాయ్).

"అబ్బాయ్, శేష్... అదేమిటి? జంధ్యం వేదీ?" అన్నాడు భాస్కరంగారు నిలువుగుడ్డు పడిపోయి, 'శూద్ర'గా ఉన్న నా ఎడం భుజంకేసి చూస్తూ.

"లేదు, తీసి పారేశాను" అన్నాను.

"అదేం?"

"మోతబరువని."

"ఎప్పుడు తీసేశావేం?"

"వొడుగు కాగానే తీసేశాను."

భాస్కరం ముక్కుమీదికి భాస్కరం వేలు ఆటోమాటిక్‌గా వచ్చేసింది.

"మీ అమ్మా నాన్నా పోయారని విన్నాను. వాళ్ళకింత పిండమైనా వెయ్యటం లేదన్నమాట" అన్నాడాయన నోట మాట పెగలగానే.

"బతికున్న నాకే పిండాకూడు లేక చస్తుంటే చచ్చిపోయిన వాళ్ళ పేరు చెప్పి బ్రాహ్మలా, గోవులా ఎక్కడ మేపను?"

"నీలో పాపభీతి కూడా లేదన్నమాట" అన్నాడాయన.

"లేదండీ. నాకున్నదల్లా ఒక్కటే భయం. బతుకంటే భయం. ఎట్లా బతకాలో నాకు తెలీదు. ఆకలి భయంకరమైనది. రోగం భయంకరమైనది. చావంటేకూడా నాకంత భయంలేదు."

"ఇన్నిటిని మించినది నరకం ఉందిగదా! దాన్ని గురించి మనమంతా భయపడ వలసిందేగదా?"

"నరకం అంటూ ఏమీ లేదులెండి. అది ఉత్త కల్పన."

"నీకెట్లా తెలుసు?"

నాకు మండిపోయింది. "కొంచెం వాకబు చేశాను నరకం గురించి. అందరూ ఎవరో చెప్పగా విన్నవాళ్ళే" అన్నాను.

ఆయన నాతో వాదించలేదు. మళ్ళీ ఆ విషయం ఎత్తను కూడా లేదు. జంఝుం ఇచ్చి, "దీన్ని వేసుకో, ఆయన ఏమన్నా అనుకుంటాడు" అన్నది.

'ఆయన' అంటే భాస్కరం గారని నాకు చప్పున తెలీలేదు.

"నా జంఝుం గొడవ ఆ భాస్కరానికెందుకు?" అన్నాను.

"నీ ఉద్యోగం గొడవ మాత్రం ఆయన కెందుకురా, పిచ్చివాడా! ఆ మాట అని ఊరుకున్నాడా? జంఝుం వేసుకున్నంత మాత్రాన నీకు పోయేదేమిటి? ఆయన సంతోషిస్తాడు – పెద్దవాడు" అన్నది మా అత్తయ్య.

అట్టే వాదిస్తే నేను జంఝుప్పోచను పామన్నంతగా చూసి భయపడుతున్నట్టు కనబడాలిసొస్తుందని వేసేసుకున్నాను.

కాని ఆ జంఝుప్పోచ నా ప్రాణానికి పామే అయింది. నేను మా అమ్మ తద్దినమూ, మా నాన్న తద్దినమూ పెట్టవలసి వచ్చింది.

పోట్లాడాను. పెనుగులాడాను. కొండ చిలవ చుట్టలలో ఇరుక్కున్న జంతువు కూడా పెనుగులాడుతుంది. ఏం ప్రయోజనం! మా అమ్మా, నాన్నా పోయిన తిథులు నాకు తెలీవు. మా అత్తయ్యక్కూడా తెలుసుననుకోను. ఆవిడే ఆ భాస్కరంతో నోటికి వచ్చిన

తిథులు ఉజ్జాయింపుగా చెప్పి వుంటుంది. మిగిలిన పని అంతా – అంటే బ్రాహ్మలను పిలిపించటమూ, మా అత్తయ్యచేత గారెలు వండించటమూ వగైరాలు – ఆయనే చేశాడు.

నా కష్టాలు అక్కడితో ఆగలేదు.

ఒకరోజు ఆయన నాతో నాకు ఉద్యోగం ఇచ్చిన వాళ్ళకు నేనెంతగా రుణపడి ఉన్నానో, వాళ్ళపట్ల నే నెంత భక్తి శ్రద్ధలతో మసులుకోవాలో వుపన్యసించాడు.

"మనచేత పని చేయించుకుంటారు. జీతం డబ్బులిస్తారు. ఎప్పుడవసరం లేదనుకుంటే అప్పుడు పావుతావు మన మొహాన కొడతారు. చేసేపని సక్రమంగా చెయ్యాలని ఒప్పుకుంటాను కాని వాళ్ళకు రుణపడి ఉంటానని ఒప్పుకోను. వాళ్ళు మనని పోషించే ఫ్యూడల్ లార్డులు కారు" అన్నాను.

నేను అని ఏం లాభం? ఆయన ఇంకా పారిశ్రామిక విప్లవం దాకా రాలేదు.

"ఇదిగో చూడబ్బాయి. ఇది రష్యా అనుకుంటున్నట్టున్నావు. కాదు. కమ్యూనిస్టుల కబుర్లు వినిచెడిపోకు" అని భాస్కరంగారు నన్ను మందలించాడు.

"నేను చెడిపోవడమంటూ జరిగితే నెహ్రూ పుస్తకాలు చదివే చెడ్డాలెండి" అన్నాను.

"నెహ్రూ పుస్తకాలేమిటి?" అన్నాడాయన. నెహ్రూ పుస్తకాలు రాశాడని ఆయనకు తెలీదు.

"ఏవో రాశాడులెండి. ఆయన అప్పుడవి రాసిన కారణంగానే కాంగ్రెసు సోషలిస్టు పంథా గురించి తీర్మానం చేస్తూ వస్తున్నది" అన్నాను.

ఆయన బిగ్గరిగా నవ్వి, "అదా, అదంతా నువు నిజంగా నమ్మావూ?" అన్నాడు.

నేను నమ్మలేదుగాని, ఆయనకా సంగతి తెలియనివ్వలేదు.

"ఏమిటండీ మీరనేది? కాంగ్రెసు వాళ్ళు సోషలిజం తీసుకురారనా?" అన్నాను.

అంతలావు భాస్కరంగారూ కాస్త భయపడ్డట్టు కనబడ్డాడు.

"తేకేం? తెస్తారు! కాని అది నువ్వనుకున్నట్టుండదు."

"నేనేమీ అనుకోలేదండీ" అన్నాను.

"ఇప్పుడున్నట్టే ఉంటుంది. ఇప్పుడున్నది సోషలిజమే. ఈ పంచవర్ష ప్రణాళికలన్నీ ఏమిటి? ఈ పన్నులేమిటి? ఈ జమీందారీల రద్దులేమిటి? ఈ ప్రభుత్వ రంగమేమిటి? ఇదంతా సోషలిజం కాదూ?" అన్నాడు భాస్కరంగారు. ఆయన మాట్లాడే తీరు చూస్తే, "మనకింత సోషలిజం దేనికి?" అన్నట్టున్నది.

ఉద్యోగం వదులుకుని పారిపోవాలని ఎన్నిసార్లు అనిపించిందో చెప్పలేను. కాని తిండికి మాడటమంటే భయంగానే ఉంది. ప్రాణం నిలబెట్టుకోవటానికి బ్రాహ్మలనూ, గోవులనూ హత్య కూడా చెయ్యవచ్చున్నప్పుడు, జంఝం వేసుకుని తద్దినాలు పెడితేనూ,

భాస్కరం గారు చెప్పే శిలాయుగపు మాటలు వింటేనూ పోయిందేవిటి లెమ్మని మనస్సును సరిపెట్టుకుంటూ వచ్చాను.

నేనాయనకు బాగా దొరికాను. ఆయన బాగున్నయ్యన్న పుస్తకాలు నేను బాగా లేవనరాదు. తిక్కన సోమయాజి వ్యావహారిక భాషలోనే చాలామటుకు భారతం రాశాడన్నందుకు ఆయనకు వచ్చిన కోపం చూసితీరాలి.

సినిమాల విషయంలో కూడా ఆయన బాగున్నదన్న సినిమాను నేను ఆక్షేపించరాదు.

నేనాయనకు విరుద్ధంగా చెప్పినప్పుడల్లా మా అత్తయ్య "నీకు చిన్నంతరం పెద్దంతరం తెలీదేం? ఆయన ఎంత తెలిసినవాడు! అటువంటి వాడి దగ్గిర నువు ఎన్ని విషయాలైనా నేర్చుకోవచ్చునే!" అని కోప్పడుతుంది.

నేను అప్రయోజకుణ్ణి కావచ్చునుగాని అజ్ఞానిని కాను. ఈ భాస్కరంగారు కలలో కూడా ఊహించని విషయాలు నాకు వందలూ, వేలూ తెలుసు. అవి తెలుసుకునే నేను సగం ఎందుకూ పనికి రాకుండా పోయింది.

అన్నీ భరించాను. కాని ఇప్పుడాయన నామీదో తుపాను ప్రయోగిస్తున్నాడు. నేను రాధమ్మాయిని పెళ్ళిచేసుకోవాలిట!

నేను చచ్చినా చేసుకోను. మా ఆదెమ్మత్తయ్య మగవాడై ఉంటే అది నాకు చెల్లెలవుతుంది. ఇటువంటి పెళ్ళిళ్ళు జీవశాస్త్ర రీత్యా మంచివి కావనీ, దిక్కు మాలిన మేట్రియార్కీని పడదొయ్యటానికి మగవాళ్ళు ఈ మేనరికపు పెళ్ళిళ్ళు ఏర్పాటుచేశారనీ నేను గొంతు చించుకుని వాదించాను.

"ఇంకానయం! మేట్రీ లేదు. యార్కీ లేదు. అర్జునుడు సుభద్రను చేసుకోలేదూ? మేనరికాలు మనకు చాలా పవిత్రమైనవి. మన సినిమాలు చూడు. మన కథలు చూడు" అన్నాడు భాస్కరంగారు.

నేనీ పెళ్ళి చేసుకోను, అసలు నా వంటి అప్రయోజకుడికి పెళ్ళెందుకు? పెళ్ళామెందుకు? ఇన్నాళ్లూ ఆశమీద బతికాను – ఇంకేదో ఉద్యోగం రాక పోతుందా, నేను ఈ భాస్కరం ఊబినుంచి బయట పడకపోతానా అని!

నన్నెవరన్నా ఈ ఊబినుంచి బయటికి లాగి పుణ్యం కట్టుకోండి! దేశం బొత్తిగా ఇంత గొడ్డుపోయిందా? తలుచుకుంటే ఇదంతా పెద్దప్లానని తెలుస్తున్నది. మా అత్తయ్య నాకా పాతిక రూపాయలూ ఆనాడు పంపింది ఇందుకే! నేనావిడ మీద కృతజ్ఞతతో ఎంత బాధపడ్డాను! ఉద్యోగం ఇప్పించాడు గదా అని ఈ భాస్కరం అజ్ఞానాన్ని ఎంత సహించాను!

నేను నిజంగా ఎంత వాజమ్మనో తలుచుకుంటే నాకే ఆశ్చర్యంగా ఉంది!

***ముద్రణ : పెళ్ళి చెయ్యకుండా చూడు, కథల సంపుటి, నవంబర్ 1968***

***ఎమెస్కో, మద్రాసు***